04-05-2025
ఆదివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM

తెలుగు దినపత్రిక

ప్రభాత

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 221 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి

## లెక్కల్లో తేడ రాకుండా చేసుకోండి



జయభేరి, హైదరాబాద్, మే 3 :

ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది. కొలతల్లో తేడా వస్తే మాత్రం కేంద్రం ఇచ్చే నిధులకు అనర్హులు అవుతారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఈ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల్లో ఎంపిక ప్రక్రియ చాలా వేగంగా జరుగుతోందని అన్నారు. ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు వేగంగా జరిగే చూస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఆరు వందల చదరపు

...మిగతాది 2 లో



## కేబినెట్ రేసులో విజయశాంతి

జయభేరి, హైదరాబాద్,మే 3:

తెలంగాణ క్యాబినేట్ విస్తరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కోల్డ్ స్టోరేజీలో పెట్టినా.. నేతల ప్రయత్నాలు మాత్రం ఆగడం లేదు. ఎవరికి వారు ఆ అమాత్య పదవి కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా చట్టసభల్లో అడుగు పెట్టిన నేతలు సైతం మంత్రి పదవి కోసం తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు తెంగాణ కాంగ్రెస్ లో చర్చంతా తాజా ఎమ్మెల్సీ విజయశాంతి గురించే జరుగుతోంది. నెల రోజుల క్రితం పెద్దల సభ శాసనమండలిలో అడుగు పెట్టిన ఆమె..మంత్రి పదవిపై కన్నేశారన్న టాక్ విన్పిస్తోంది. ఎలాగైనా క్యాబినేట్లో స్థానం దక్కించుకోవాలని గట్టి పట్టుదలతో ఉన్నారట.తెలంగాణ కేబినెట్ లో ప్రస్తుతం సామాజిక సమీకరణాలు కొలిక్కి రాకపోవడంతో

...మిగతాది 2 లో



## ఏసీబీ కస్టడీకి ఈఎన్సీ హరిరాం

- 36 ఏండ్ల సర్వీస్లో జీతభత్యాలు
- రూ.6.75 కోట్లు ఖర్చులు రూ.3.05 కోట్లు

జయభేరి, హైదరాబాద్ :

కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ భూక్యా హరిరాం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తు మమ్మరం చేసింది. కోర్టు అనుమతితో 5 రోజుల పాటు ఆయనను విచారించనున్నది. శుక్రవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి హరిరాంను ఏసీబీ తమ కస్టడీలోకి తీసుకున్నది. సిటీ రేంజ్ 1 డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో హరిరాంను ప్రశ్నిస్తున్నారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు,

...మిగతాది 2 లో




# హామీలు సరే.. ఆచరణ ఎప్పుడు

తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచితాల మీద ఉచితాలు ప్రకటించారు. ఏకంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియాగాంధీ లాంటి వారిని పిలిపించి డిక్లరేషన్లు ప్రకటించారు. కానీ వాటి అమలులో మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు. వాస్తవానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో రేవంత్ రెడ్డికి తెలుసు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే నాటి కెసిఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేసింది.

జయభేరి, హైదరాబాద్,మే 3 :

గడువు ముగియకముందే ముందుగానే వైన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. తద్వారా అప్పటి ఎన్నికల్లో నెగ్గడానికి ప్రణాళికలు రూపొందించింది. కానీ ఆ ఎన్నికల్లో ప్రజలు వేరే విధంగా తీర్పు ఇవ్వడంతో భారత రాష్ట్ర సమితికి తల బొప్పి కట్టింది. ఇక నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చింది. వాటిల్లో కొన్ని మాత్రమే అమలులో పెట్టింది. అమలు ఉన్న పథకాలు కూడా అంతంతమాత్రంగానే ప్రజలకు చేరువవుతున్నాయి. ఇక ఇదే విషయాన్ని ప్రతి పక్ష భారత రాష్ట్ర సమితి ప్రస్తావిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి దిగుతోంది. ఇది ఊహించిన పరిణామమే అయినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సరికొత్త పల్లవి అందుకుంది. ఇటీవల జరిగిన ప్రతి సమావేశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్నారు. చివరికి ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరితే.. తెలంగాణ ఆర్టీసీ ఇప్పుడిప్పుడే బాగుపడుతోందని.. కార్మికులు సమ్మెకు దిగితే నష్టం తీవ్రంగా వాటిల్లుతుందని వాపోయారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ఏమాత్రం బాగోలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు..

...మిగతాది 2 లో

## అమరావతిపైనే బాబు కోటి ఆశలు



జయభేరి, విజయవాడ, మే 3 :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలల రాజధానికి మరి కొద్ది క్షణాల్లో శంకుస్థాపన జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి వచ్చి మరీ పాల్గొంటున్నారు. ముందుగా సేకరించిన 33 వేల ఎకరాలకు తోడు మరో 44 వేల ఎకరాలను సేకరించి దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఇందుకోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. విమర్శలను సయితం పక్కన పెట్టి రాజధాని నిర్మాణం పూర్తయితే వచ్చేకిక్కు కోసం ఆయన వెయిట్ చేస్తున్నారు. తాను హైదరాబాద్ లో

...మిగతాది 2 లో




## ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఉప్పల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట ప్రభుత్వాన్ని తప్పకుండా మెడలు వంచి తీరుతాం
- బిజెపి రాష్ట ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ శాసనసభ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్

జయభేరి, హైదరాబాద్, మే 3 :

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ను నిరసిస్తూ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ శాసనసభ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో భారీ ర్యాలీ

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## హామీలు సరే.. ఆచరణ ఎప్పుడు

తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నామని రేవంత్ రెడ్డి పదేపదే వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగో లేనప్పుడు.. అని హామీలు ఎవరు ఇవ్వమన్నారు? ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించమని ఎవరు చెప్పారు? నాడు అవుటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చినప్పుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిని లెక్కలతో సహా వివరించారు. మరి అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు మొత్తం అమలు చేయాలంటే డబ్బులు ఉండాలనే విషయం రేవంత్ రెడ్డికి తెలియదా.. అంటే అధికారం కోసం ఎన్ని హామీలైనా ఇస్తారా? చివరికి ఓట్లు వేయించుకొని ప్రజలను వెర్రివాళ్లను చేస్తారా? అంటూ రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.. ప్రతి సమావేశంలోనూ బడ్జెట్ పద్మనాభం లాగా లెక్కలు వేయడం.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం.. పరిపాటిగా మారిపోయిందని.. రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

## బాబు కోటి ఆశలు

సైబరాబాద్ ను డెవలెప్ చేసినప్పుడు వచ్చిన ఇమేజ్ కు మించి అమరావతి నిర్మాణంతో రావాలని నాయుడుగారు భావిస్తున్నారు. అందుకోసం లక్షల కోట్ల రూపాయలను వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. తొలిదశలోనే దాదాపు నలభై మూడు వేల కోట్ల రూపాయల విలువైన పనులకు నేడు శంకుస్థాపన జరగుతుంది. ఇంకా రాజధాని ప్రాంతంలో నవనగరాల నిర్మాణంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తే చాలు ఇక తన జీవితం చరితార్థమవుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే వందలకోట్ల రూపాయలు వెచ్చించి ఇంత ఆర్భాటంగా చంద్రబాబు నాయుడుఅమరావతి రాజధాని పనులకు శంకుస్థాపన మళ్లీ చేయనున్నారు. దీనికి రీ లాంచింగ్ అని పేరు పెట్టినా అమరావతికి హైప్ తెచ్చేందుకే మరోసారి శంకుస్థాపనలు చేయిస్తున్నారన్నది వాస్తవం. . దాదాపు డెబ్బయి ఏడు ఎకరాలు ఒక్క రాజధానిలో ఉండటంతో పాటు విజయవాడ, గుంటూరు నగరాలను కలిపితే ఇక ఏపీకి తిరుగుండదని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అప్పుడు పెట్టుబడుల కోసం తాము కాళ్లరిగేలా తిరగాల్సిన పనిలేదని, వాటంతట అవే వచ్చిపడతాయన్న నమ్మకంతో ఏపీ సీఎం ఉన్నారు. మరోవైపు వీలయినంత త్వరగా కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా ఏర్పాటు చేసే విధంగా సహకరించాలంటూ నేడు మోదీని చంద్రబాబు నాయుడు కోరనున్నారు. ఇప్పటకే కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం భూములను కేటాయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర నుంచి అనేక ప్రముఖ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరనున్నారు. దీంతో పాటు రైతులు ప్లాట్లుగా ఇచ్చిన భూమి పోగా ప్రభుత్వానికి భారీగా వేలాది ఎకరాలు మిగలనున్నాయి. ఈ మిగిలిపోయిన ఎకరాలను వేలం వేసినా రాజధాని నిర్మాణం కోసం చేసిన ఖర్చు వెనక్కు తిరిగి వస్తుందని చంద్రబాబు అంచనా. అందుకే తెగించి ఆయన ఈ నిర్ణయం తీసుకునట్లే కనపడుతుంది. వేగంగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసిన తర్వాత తనకు ఇంకేమీ ఆశ మిగలదని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అంటే ఆయన అమరావతి నిర్మాణాన్ని ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో అర్థమవుతుంది. రాజధాని అమరావతి పూర్తయిన తర్వాత తనను తెగిడిన వాళ్లు కూడా ఖచ్చితంగా పొగుడ్తారని ముందుకు చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. మరి ఏం జరుగుతుందన్నది తెలియాలంటే మరో మూడేళ్ల కాలం వెయిట్ చేయాల్సిందే.

## ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో..

నిర్వహించారు.హైదరాబాద్ నుంచి యాదాద్రి, వరంగల్ మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉప్పల్ సమీపంలో ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ (ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్) నిర్మాణాన్ని ప్రారంభించింది. కానీ ఈ ప్రాజెక్టు పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం సహాయనిరాకరణ కారణంగా తీవ్ర జాప్యం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం నితిన్ గడ్కరీ స్వయంగా మంజూరు చేసిన ప్రాజెక్టు ఇది. అంతేకాకుండా, గడ్కరీ స్వయంగా వచ్చి శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు కూడా ఇదే నాన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఉప్పల్ అభివృద్ధికి రూ. 600 కోట్లు టాయించారు. కేంద్రం రూ. 600 కోట్లు ఇవ్వగా, జీహెచ్ఎంసీకి అవసరమైన స్ట్రీట్ లైట్స్, వాటర్ లైన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరేళ్లు ఆలస్యం చేసింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సహాయనిరాకరణకు ఉదాహరణ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇచ్చే సమయంలో, భూసేకరణను 6 నెలల లోపు పూర్తి చేయాలని షరతుతో శంకుస్థాపన జరిగింది. కానీ అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పలు రంగాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించారు కరెంట్ స్తంభాలు తొలగించడంలో జాప్యం.

**సీవరేజ్ లైన్లు తొలగించడంలో అలసత్వంవాటర్ పైపులైన్ల విషయంలో నిర్లక్ష్యంనష్టపరిహారం చెల్లింపులో జాప్యం**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ ఈ పనులకు సహకరించలేదు.ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మొద్దునిద్ర వహిస్తూ ఉప్పల్ జంక్షన్ అభివృద్ధిలో జాప్యం చేస్తోందని విమర్శించారు.. గతంలో మంత్రి కేటీఆర్‌ను నిలదీసిన తర్వాతే ఉప్పల్‌లో కొన్ని స్తంభాలు, ఇతర కట్టడాలు తొలగించబడ్డాయి. మే 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హైదరాబాద్ వస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఒత్తిడి తెచ్చి, ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చి, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను వెంటనే పూర్తిచేయాల్సిన అవసరం ఉంది. ఉప్పల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించబడింది. ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పకుండా మెడలు వంచి తీరుతా మన్నారు.

## ఏసీబీ కస్టడీకి ఈఎన్సీ హరిరాం

బ్యాంక్ అకౌంట్లు, బినామీ పేర్లతో ఉన్న ఆస్తుల వివరాలను రాబట్టనున్నారు. మొదటి రోజు కస్టడీ విచారణలో భూక్యా హరిరాం కు చెందిన వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక వివరాలు సేకరించారు. ఉద్యోగంలో చేరడానికి ముందు, చేరిన తర్వాత ఆయన సంపాదన గురించి ఆరా తీశారు. ఇప్పటికే ఏసీబీ సేకరించిన ప్రాథమిక వివరాల ప్రకారం.. ఏపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్ ద్వారా 1989 అక్టోబర్ 11న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఈఈ, గా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో హరిరాం చేరారు. ప్రమోషన్ల వారీగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ క్రమంలో నాటి సర్కారు ఆశీస్సులతో అతి తక్కువ సమయంలోనే ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా ప్రమోషన్ పొందినట్టు అధికారులు గుర్తించారని సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్‌కు ముందు గజ్వేల్ ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ సీఏడీ, ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా హరిరాం పనిచేస్తున్నారు.

**ఇరిగేషన్ శాఖలో అత్యున్నత పదవులు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో హరిరాం కీలకంగా వ్యవహరించారు. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్, ఎండీగా విధులు నిర్వర్తించారు. 2016 ఆగస్టు 5 నుంచి 2017 ఫిబ్రవరి 28 వ తేదీ వరకు డైరెక్టర్‌గా కొనసాగారు. ఆ తర్వాత తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నామినీ డెరెక్టర్‌గా 2017 జూన్ 29 వరకు, మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా 2022 జనవరి 20వ తేదీ వరకు పనిచేశారు. గజ్వేల్ ఇరిగేషన్ అండ్ సీఏడీ ఈఎన్సీగా విధులు నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ సహా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో కీలక పదవులు నిర్వహించిన సమయంలో భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు గత నెల 26న టోలిచౌకిలోని హరిరాం నివాసంతో పాటు సిద్దిపేట, ఖమ్మం జిల్లాలు సహా మొత్తం 13 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

**అధికారికంగా కొంతే అక్రమాస్తులు ఎన్నో..**

హరిరాం ఉద్యోగంలో చేరిన నుంచి 36 ఏండ్ల సర్వీస్‌లో జీతభత్యాలుసహా అధికారికంగా రూ.6.75 కోట్లు సంపాదించగా.. భార్య, ఇద్దరు పిల్లల అవసరాల కోసం రూ.3,05,69,638 ఖర్చు చేసినట్లు ఏసీబీ అధికారులు అంచనా వేశారు. ఆయన సంపాదనలో ఖర్చులు పోను రూ.3 కోట్ల 69 లక్షల 29 వేల 789 మాత్రమే సేవింగ్స్ ఉండాలని లెక్కలు తేల్చారు. కానీ, రూ.5 కోట్ల 26 లక్షల 13 వేల 294 అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఇది ఆదాయానికి మించి అక్రమ సంపాదనగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ప్రకారం ఆస్తుల విలువ మొత్తం రూ.8 కోట్ల 95 లక్షల 43 వేల 789. వీటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల దాకా ఉంటుందని భావిస్తున్నారు కాగా, 5 రోజుల కస్టడీలో ఈ ఆస్తుల చిట్టాను బయటపెట్టే అవకాశం కనిపిస్తున్నది.

# లెక్కలు తేలతాయా..?

**జనాభా లెక్కలతోపాటే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయానికి రావడం ఎంతైనా ముదావహం. సామాజిక విలువలు, ప్రయోజనాలను కాపాడటానికే ఈ కులగణన నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది. అయితే, రాహుల్‌గాంధీ రెండేళ్లనుంచి ఎత్తుకున్న ఓబీసీ ఎజెండాను దెబ్బతీసే రాజకీయ ఎజెండాలో భాగంగానే ప్రభుత్వం ఈ అంశానికి ఆమోదముద్ర వేసిందనే విషయం సూక్ష్మంగా పరిశీలిస్తే అర్థమవుతుంది.**

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాల ప్రకటన సందర్భంగా కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కులగణనను కాంగ్రెస్ మొదటినుంచి వ్యతిరేకించిందని చెప్పారు.కాంగ్రెస్‌సహా దాని మిత్రపక్షాలు ఈ అంశాన్ని రాజకీయ కోణంలోనే చూశాయని మండిపడ్డారు. దీనిద్వారా ఓబీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపిస్తుందనే భావనను కేంద్రమంత్రి ఆయా వర్గాల్లో కలిగించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తున్నది. నిజానికి ఓబీసీ ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ కోల్పోయిన విషయాన్ని రాహుల్‌గాంధీ గుర్తించారు. తిరిగి వాళ్ల అభిమానాన్ని చూరగొనేందుకు కృషి చేయాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ తరుణంలోనే భారత్ జోడో యాత్ర సందర్భంగా కులగణన అంశాన్ని లేవనెత్తారు.2019 సాధారణ ఎన్నికల్లో కేవలం 50 సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ 2024 నాటికి 99 సీట్లను కైవసం చేసుకుంది. దీనికితోడు తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చింది. ఈ పరిణామాలన్నీ హస్తం పార్టీ నేతలు కులగణన మంత్రం పని చేస్తుందన్న నిర్ణయానికి వచ్చేలా చేశాయి. అందువల్లే పార్లమెంట్‌లో దీనిపై రాహుల్‌గాంధీ తన గళాన్ని రెట్టింపు చేసి, బీజేపీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన కులగణనను ఓబీసీలపట్ల తమకున్న అంకితభావానికి నిదర్శనంగా పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించిన బీజేపీ పెద్దలు జనగణనలో భాగంగా కులగణన చేసేందుకు అంగీకరించారు. దీంతో కాంగ్రెస్ దగ్గర ఉన్న ఒక్కగానొక్క అస్త్రాన్ని లాక్కున్నట్టయ్యింది.బీజేపీ ఓబీసీల రిజర్వేషన్ విషయంలో మండల్ కమిషన్ సిఫార్సులను వ్యతిరేకించింది. కులభేదాలకు అతీతంగా ఏకీకృత హిందూ విధానాన్ని సమర్థించింది. అటువంటిది బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు కులగణనకు అంగీకరించడాన్ని బీజేపీ ఎన్నికల ఎత్తుగడగానే భావించాలి. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలపై కుల సమీకరణలు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. జనగణన ఎప్పుడు మొదలు పెడతారో చెప్పకుండానే కులగణనపై ప్రకటన చేయడం ద్వారా బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడమే బీజేపీ ముందున్న తక్షణ లక్ష్యం అనే సంగతీ అవగతమవుతున్నది. దేశంలో కుల గణన జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది సమాజంలోని వెనుకబడిన వర్గాలను అభివృద్ధి చేయడానికి మరింత సానుకూల చర్యలకు మార్గం సుగమం చేస్తుందని ఆయన నొక్కి మరీ చెప్పారు.ఈ నిర్ణయం తీసుకునేలా కేంద్రాన్ని ఒత్తిడి చేసింది తమ కుల గణన డిమాండేనని కాంగ్రెస్ చెబుతుండగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి



**కొంతమంది తప్పుడు క్రెడిట్‌ను పొందుతున్నారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కుల ఆధారిత రిజర్వేషన్‌కు తీవ్ర వ్యతిరేకి అని దేశప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఈ అంశాన్ని వెనక్కి నెట్టిందని ఆయన తెలిపారు.కుల గణన అంశం చాలా కాలంగా రాజకీయ చర్చనీయాంశంగా ఉంది. మొత్తానికి కుల గణన విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ పోరాటం తీవ్రంగా ఉంది.**

నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలు కుల గణనను ఎప్పుడూ వ్యతిరేకించాయని, ఆ పార్టీ ఈ అంశాన్ని రాజకీయ సాధనంగా మాత్రమే ఉపయోగించిందని బీజేపీ పేర్కొంటుంది.ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేస్తూ.. "మోదీ జీ కుల గణన చేయవలసి ఉంటుందని మేము చెప్పాము. మేము దానిని చేయిస్తాము. ఇది మా దృష్టి ప్రభుత్వం పారదర్శకమైన కుల గణనను చేస్తుందని నమ్ముతున్నాము. దేశంలోని సంస్థలు, అధికార నిర్మాణంలో ఏ వర్గాలకు ఎంత భాగస్వామ్యం ఉందో అందరికీ తెలుసు" అని అన్నారు.దీని కోసం ఒత్తిడి చేస్తూనే ఉన్న వ్యక్తులు, సంస్థలను రాహుల్ గాంధీ అభినందించారు. వారి గురించి గర్వపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రతిఘటిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నేడు మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది తప్పుడు క్రెడిట్‌ను పొందుతున్నారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కుల ఆధారిత రిజర్వేషన్‌కు తీవ్ర వ్యతిరేకి అని దేశప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఈ అంశాన్ని వెనక్కి నెట్టిందని ఆయన తెలిపారు.కుల గణన అంశం చాలా కాలంగా రాజకీయ చర్చనీయాంశంగా ఉంది. మొత్తానికి కుల గణన విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ పోరాటం తీవ్రంగా ఉంది. రాహుల్ గాంధీ దీనిని తమ విజయంగా చెప్పుకుంటున్నారు. కుల గణన ద్వారా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ వాదిస్తోంది. నెహ్రూ, ఇందిరా గాంధీల కాలంలో దీనిని వ్యతిరేకించినట్లు బీజేపీ చెబుతోంది. మండల్ కమిషన్ నివేదికను అమలు చేసినప్పుడు బీజేపీ మద్దతు ఇచ్చిందని ధర్మేంద్ర ప్రధాన్ గుర్తు చేశారు. బీజేపీ మాత్రం కాంగ్రెస్ దీనిని రాజకీయ సాధనంగా వాడుకుంటోందని ఆరోపిస్తోంది. ఈ అంశంపై ప్రజల స్పందన కూడా భిన్నంగా ఉంది. కొందరు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు బీజేపీ వాదనను సమర్థిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ అంశం ప్రధాన ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.బీజేపీ మిత్రపక్షమైన నితీష్ ప్రభుత్వం బీహార్‌లో కులగణన చేసి, రాష్ట్ర జనాభాలో 63 శాతం మంది వెనుకబడిన తరగతుల వారే అని 2023లో ప్రకటించింది. వారి అభివృద్ధి కోసం ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ చర్యలైతే తీసుకోలేదు. పార్టీలు కులాలు, రిజర్వేషన్లను రాజకీయాలకు వాడుకోకుండా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగు పరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న విషయాన్ని గర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే బావుంటుంది.

## కేబినెట్ రేసులో విజయశాంతి

విస్తరణ అంశం వాయిదా పడింది. క్యాబినెట్ కూర్పులో ఖచ్చితంగా సామాజిక సమతుల్యం పాటించాలని పార్టీ హైకమాండ్ భావిస్తోంది. ఇదే అవకాశాన్ని అదునుగా భావిస్తున్న విజయశాంతి..అదే అస్త్రాన్ని సంధిస్తున్నారు. తెలంగాణలో బీసీలలో బలమైన సామాజికవర్గమైన ముదిరాజ్ వర్గానికి క్యాబినెట్ ఛాన్స్ ఇవ్వాలని గట్టి పట్టుదలతో ఉన్నారు.భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ ఒక్కరు మాత్రమే ఆ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నారు. క్యాబినెట్ విస్తరణ జరిగితే ఆయనకే పక్కా ఛాన్స్ అని అంతా భావించారు. కానీ ఇప్పుడు ఆల్ ఆఫ్ సడెన్గా రేసులోకి విజయశాంతి వచ్చారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ ఈక్వేషన్స్ తో పెద్దల సభలోకి విజయశాంతి అడుగు పెట్టారు. ఎమ్మెల్సీ అయినప్పటి నుంచి ఆమె క్యాబినెట్ లో చోటు కోసం కసరత్తు చేస్తున్నారు. అయితే అందుకోసం సామాజిక సమీకరణాల్లో భాగంగా విజయశాంతి కూడా ఇప్పుడు ముదిరాజ్ కోటాను ప్రస్తావిస్తోంది.చాలా కాలంగా రాజకీయాల్లో ఉంటున్నా.. ఇప్పటి వరకు ఏనాడు కూడా కులం అంశాన్ని ప్రస్తావించ లేదు. గతంలో మెదక్ నుంచి ఎంపీగా పోటీ చేసినప్పుడు కులం కాలమ్ లో ఏ కులం పేరును ప్రస్తావించలేదు. ఆ తర్వాత ఎప్పుడూ కూడా ఆమె ఏ సామాజికవర్గం అనేది స్పష్టత ఇవ్వలేదు. కానీ ఇప్పుడు ఆల్ ఆఫ్ సడెన్గా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విజయశాంతి బీసీ వర్గంగా చెప్పుకున్నారు. ఇందులో ముదిరాజ్ సామాజికవర్గంలో అంతర్భాగంగా ఉన్న ఓ వర్గం తనదంటూ..ఆ కోటాలో తనకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని ఆమె కోరుతున్నారట.మొత్తం మీద తెలంగాణ రాజకీయాల్లో చాలా కాలంగా స్తబ్ధుగా ఉన్న విజయశాంతి ఒక్కసారిగా ఎమ్మెల్సీ పదవితో యాక్టివ్ పాలిటిక్స్ లోకి వచ్చారు. ఇప్పుడు ఏకంగా ముదిరాజ్ కోటాలో మంత్రిపదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే విజయశాంతి చేస్తున్న ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయనేది వేచి చూడాలి. ఆమె కోరుతున్నట్లు మంత్రివర్గంలో ఛాన్స్ ఇస్తారా లేదా అన్నది రానున్న రోజుల్లో తేలిపోనుంది.

## లెక్కల్లో తేడ రాకుండా చేసుకోండి

అడుగులకు మించి నిర్మించొద్దని సూచించారు. అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే మాత్రం కేంద్రం నుంచి వచ్చే నిధులు రావని అప్పుడు కేవలం రాష్ట్రం ఇచ్చే నిధులతోనే ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి అవగాహన సదస్సులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో చాలా అంశాలపై చర్చించారు. ప్రతి నియోజకవర్గానికి మూడవేల ఐదు వందల ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక చాలా వేగంగా జరగాలని సూచించారు మంత్రి. ఇలా ఎంపిక చేసిన వారిలో ఐదు వందల మంది పట్టణ ప్రాంతం ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు ఎంపికైన వాళ్ల జాబితా సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. దీని కోసం ఇంఛార్జ్ మంత్రులతో చర్చించాలని అధికారులకు సూచించారు. అర్హులందర్నీ ఎంపిక చేయాలని అదే టైంలో అనర్హులను కూడా గుర్తించాలని సూచించారు మంత్రి. లిస్ట్‌లతో సంబంధం లేకుండా అర్హులు ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. నిరంతరం ఈ ప్రక్రియ జరగాలన్నారు. భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్ ఓ ఆర్ చట్టంలో భాగంగా ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాకు ఒక మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై మొదటి విడతగా రాష్ట్రంలోని 4 జిల్లాల్లో 4 మండలాల్లోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఇందులో వివిధ రకాల సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జూన్ 2వ తేదీ వరకు పైలట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 4 మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై 12 వేల 759 దరఖాస్తులు వచ్చాయని, రాష్ట్రవ్యాప్తంగా జరిగే రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 15 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు సక్రమంగా జరిగేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూముల్లో పొజిషన్ ఉన్న రైతుల దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని, భూమిలేని అర్హులైన నిరుపేదలు ఉన్నట్లయితే పట్టాలు ఇచ్చేందుకు సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. భూభారతి చట్టం అమలులో అధికారులు అందుబాటులో ఉన్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 4వ తేదీన నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, రాష్ట్రంలోని 24 జిల్లాల్లో 190 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 507 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## హైదరాబాద్లో దారుణ ఘటన.. బాలుడిపై యువతి లైంగికదాడి

- **నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**
- **16 ఏళ్ల మైనర్ బాలుడిపై 28 ఏళ్ల యువతి పలుమార్లు లైంగికదాడి**
- **రోజురోజుకూ ఆమె వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక పేరెంట్స్కు చెప్పిన బాలుడు**
- **బాధితుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో వెలుగులోకి షాకింగ్ ఘటన**

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 16 ఏళ్ల మైనర్ బాలుడిపై 28 ఏళ్ల యువతి పలుమార్లు లైంగికదాడికి పాల్పడింది. నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూబ్లీ హిల్స్ లో నివాసం ఉండే 28 ఏళ్ల ఓ యువతి... తన ఇంటి పక్కన ఉండే 16 ఏళ్ల బాలుడితో పరిచయం పెంచుకుంది.

ఆ తర్వాత తన ఇంటికి పిలిచిన ఆమె బాలుడిని మాయమాటలు చెప్పి లోబరుచుకుంది. అలా పలుమార్లు తన ఇంట్లోనే మైనర్పై ఆమె లైంగికదాడికి పాల్పడింది. ఈ విషయం బయటకు చెబితే తనపై అత్యాచారం చేశావని చెబుతానంటూ బాలుడిని బెదిరించింది. దాంతో భయపడిపోయిన బాలుడు ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. తాజాగా మరోసారి అతనిపై లైంగిక దాడికి పాల్పడిందామె.

అలాగే అసభ్యకరమైన పనులు చేయాలంటూ బాలుడిని బలవంతం చేసింది. రోజురోజుకూ ఆమె వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేకపోయిన మైనర్... తనపై గతకొంతకాలంగా యువతి చేస్తున్న దారుణాన్ని పేరెంట్స్కు చెప్పాడు. దాంతో బాలుడి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధిత బాలుడి పేరెంట్స్ ఫిర్యాదు మేరకు పోలీసులు యువతిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి పిలుపు



**జయభేరి, పరవాడ:**

లేబర్ కోడ్ లను రద్దు చేయాలని మే 20న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సమ్మె బుక్ లైట్ శనివారం పరవాడలో సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల పోరాటాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలు కి అనుకూలంగా మార్పులు చేసే చర్యలు నిర్మించాలని బ్రిటిష్ కాలం నుంచి కార్మిక పోరాటాల ఫలితమే కార్మిక చట్టాలు అని గనిశెట్టి అన్నారు ట్రేడ్ యూనియన్ చట్టం 1926 లోను పరశురాం కి వేదాలు చట్టం 1947 లోను స్టాండింగ్ ఆర్డర్ చట్టం 1946 లోను వేతనాలు చెల్లింపు చట్టం 1936 కనీస వేతనాలు చట్టం, బోనస్యలింపు చట్టం సమాన పనికి సమాన వేతన చట్టం అనేక కార్మిక చట్టాలు పోరాట సాధించుకుంటే సామాజిక భద్రత కోడ్ పేరుతో 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లగా మార్పులు చేసి యాజమాన్యాలకు కార్మికులను కట్టు బానిసలుగా చేసే చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలు వ్యతిరేకంగా కార్మిక వర్గం మే 20వ తేదీ జరిగే సమ్మెను జయప్రదం చేయాలని గని శెట్టి పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి వాటిని అమలు చేయడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది దీనిని నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక ,రైతు సంఘాలు మే 20 తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ చట్టాలు అమలు జరిగితే ఇప్పుడున్న కార్మిక హక్కులు ఉండవని ప్రైవేటీకరణ, కాంట్రాక్టు పద్ధతిలో అతి తక్కువ జీతాలతో పని చేయడం పని భద్రత లేకపోవడం వంటి అనేక సమస్యలతో కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు గురవుతారని ఈ లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మికులందరిలో ప్రచారం నిర్వహించి ఈ సమ్మెను విజయవంతం చేయాలని సమ్మె బుక్ లైట్ విడుదల చేయడం జరిగింది.కార్మిక వర్గం పెద్దలు పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే రమణ, రాజు, అప్పలరాజు, జి చిట్టిబాబు, జే పెంటారావు, ఎస్ అప్పలనాయుడు, ఎం కొండబాబు, వి అప్పలనాయుడు, పి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు పై చెత్త వేస్తున్న వారి పై చర్యలు

**జయభేరి, ఘట్కేసర్ :**

ఘట్కేసర్ మున్సిపాలిటీ కి ఇంచార్జి కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న భాస్కర్ రెడ్డిని అయన ఛాంబర్ లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఘట్కేసర్ మున్సిపాలిటీ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతు.. ఘట్కేసర్ మున్సిపాలిటీలో మంచి నీటి సరఫరా చాలా తగ్గుముఖం పట్టింది అని పలు వార్డులో ఉన్న బోర్ లు అందుబాటులోకి తీసుకోవచ్చి వేసవి లో ప్రజలకు సరిపడా నీరు అందేలా చూడాలని అదేవిధంగా పలు వార్డులో రోడ్లు గుంతలు పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది అవుతుంది అని, రోడ్లు, వాడాలు శుభ్రం చేపించాలని, చెత్త సేకరణ వాహనాలు పలు వార్డులో సరిగ్గా రావడం లేదు అని, రోడ్డు పై చెత్త వేస్తున్న వారి పై చర్యలు తీసుకోవలని కమిషనర్ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్ గారు, ఉపాధ్యక్షుడు నాగరాజు ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు, మైసమ్మ గుట్ట మాజీ ఛైర్మన్ చిత్తరి యాదవ్, మాజీ వార్డు మెంబర్ నర్సింగ్ రావు, వెంకట్ నారాయణ, మొయినార్టీ అధ్యక్షుడు ఫరూక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి, రఫిక్, కాయుమ్, సత్తి రెడ్డి, మల్లేశ యాదవ్, సిరాజ్ , గోదా గణేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


## శ్రమశక్తి అవార్డు గ్రహీతకు ఘనంగా సన్మానం

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మే డే వేడుకలలో భాగంగా INTUC రాష్ట్ర ఉపాధ్యక్షుడు, డెక్కన్ క్రానికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కసిరెడ్డి జగన్మోహన్ రెడ్డి గారికి శ్రమశక్తి అవార్డు వచ్చిన శుభ సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్, శ్రీరామ్ నగర్ కాలనీ ఆయన స్వగృహంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పరిసర కాలనీల సంక్షేమ నాయకులతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన్సూరాబాద్ నివాసి కసిరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఎంప్లాయిస్ కొరకు చేసినటువంటి ఆయన సేవలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి శ్రమ శక్తి అవార్డు ఇచ్చినందుకు స్థానికంగా గర్వంగా ఉందని ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం నగర్ కాలనీ అధ్యక్షుడు కొప్పుల ఉపేందర్ రెడ్డి, లక్ష్మీ నరసింహ, సత్తయ్య, పద్మారావు, భూపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సాయినాథ్, రామచంద్రారెడ్డి, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బాలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన కార్యాలయ ప్రారంభోత్సవంను విజయవంతం చెయ్యండి

- మండల వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు కోన రామారావు

**జయభేరి, పరవాడ:**

సబ్బవరం మండలం ఇరువాడ గ్రామం గణపతినగరం మెయిన్ రోడ్డు లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్యర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని దీనికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఉపముఖ్య మంత్రి బూడి ముత్యాలు నాయుడు,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్,అనకాపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ కరణం ధర్మ శ్రీ వస్తున్నారని ఈ కార్యక్రమంకి మండలలో గల ముఖ్య నాయకులు, పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీలు,గ్రామ పార్టీ ల అధ్యక్షులు గ్రామ పార్టీ ముఖ్య నాయకులు,మహిళా నాయకులు కార్యకర్తలు అందరూ తప్పని సరిగా పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని పరవాడ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోనరామారావు పత్రిక ప్రకటనలో తెలిపారు.

# ఉప్పల్ నల్లచెరువు అభివృద్ధికి భారీగా నిధులు

- రూ. 27 కోట్లతో అభివృద్ధి సుందరీకరణ పనులు
- పనులను పరిశీలించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్లోని నల్లచెరువు అభివృద్ధికి భారీగా నిధులు మంజూరైనట్టుగా కార్పొరేటర్ మందుములరజిత పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో చెరువు అభివృద్ధికి, సుందరీకరణ పనులకు రూ.27 కోట్ల నిధులు మంజూరు చేసినట్టుగా చెప్పారు. శనివారం కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి అధికారులతో కలిసి ఉప్పల్ నల్ల చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉప్పల్ లోని నల్ల చెరువు ఒకవైపు కబ్జాలతోనూ, మరోవైపు కలుషిత జలాలతో ప్రమాదకర పరిస్థితి ల్లో ఉంది. దీనిని గ్రహించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఇదే విషయాన్నిసీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో పాటు చెరువు అభివృద్ధి, సుందరీకరణకు కావాల్సిన రూ.27 కోట్ల నిధులను మంజూరు చేయించారు. మొదటి విడతలో చెరువు లో అభివృద్ధి పనులను చేపట్టనున్నారని రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఇందుకు 9.9 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువులోకి మంచినీరు వచ్చే విధంగా చూడటం, చెరువులో ఉన్న పూడికను తొలగించడం, చెరువు యొక్క ఎఫ్ టిఎల్ పరిరక్షించడం, తూమును నిర్మించడం, తదితర పనులను చేపట్టనున్నట్టుగా రజిత పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో హైడ్రా డీఈ నాగరాజు, ఏఈఈ సత్యబాబు, తహశీల్దార్ సత్యబాబు యూనిస్, కాంగ్రెస్ నాయకులు బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, భాస్కర్, అలుగుల అనిల్ కుమార్, బొమ్మాజీ రత్నం, విజయలక్ష్మి, మోహన్ నాయక్, నాగు నాయక్, నాగూర్ భాష, విజయ్, టైలర్ సత్తి, సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రసూల్, ఉషాల్ తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మతల్లి జాతర గోడపత్రిక ఆవిష్కరణ

- ముఖ్య అతిధిగా జనసేన పార్టీ పరవాడ మండల ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్




**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలమ్మతల్లి అమ్మవారి జాతరను 20 తారీఖున మంగళవారం మనంగా నిర్వహిస్తున్నామని . ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మరియు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు జాతరకు సంబంధించి ముద్రించిన గోడపత్రికను శనివారం పరవాడ జనసేన పార్టీ కార్యాలయంలో పరవాడ జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్ ఆవిష్కరించారు. జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్థానిక పెద్దలు, నాయకులు, యువకులు, ప్రజలు ముత్యాలమ్మ జాతర మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక నాయకులు, పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్కీముల పేరుతో స్కాములు చేసిన వారిని వదిలిపెట్టం

- మంత్రి సీతక్క



**జయభేరి, హైదరాబాద్ మే 3 :**

స్కీముల పేరుతో స్కాములు చేసిన వారిని వదిలిపెట్టమని మంత్రి సీతక్క హెచ్చరించారు. మహబూబాబాద్ బత్తులపల్లి లో సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ స్కీమ్ లో డబ్బులు తీసుకున్నవారి నుంచి ముక్కుపిండి వసూలు చేస్తామని సూచించారు. గొర్రెల పథకాన్ని వినూత్నంగా అమలు చేస్తామని సీతక్క హామి ఇచ్చారు.

# దేశంలో జన, కులగణన చారిత్రాత్మకమైన నిర్ణయం

- ఈ నిర్ణయం ఓబీసీలకు రాజకీయ,సామాజిక,విద్య, ఉద్యోగాల,పరంగా మరింత అవకాశాలు
- బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడే పార్టీ భారతీయ జనతా పార్టీ



**జయభేరి, ఘట్కేసర్ :**

దేశంలో జనగణన తోపాటు కులగణన చేయడం చారిత్రాత్మకమైన నిర్ణయమని ఘట్కేసర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి అన్నారు. వారి ఆధ్వర్యంలో జన, కులగణన ఆమోదించినందుకు అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ గారు మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మాజీ ఎంపీపీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డితో కలిసి పాల్గొని ప్రధాని మోడీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో 60 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ల ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. ఈ నిర్ణయం ఓబీసీలకు గొప్ప గుర్తింపని రాజకీయ, సామాజిక, విద్య, ఉద్యోగాల, పరంగా ఓబీసీలకు అవకాశాలు మరింత పెరుగుతాయన్నారు. ఓబీసీలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రుణపడి ఉన్నారని ఎన్నో సంవత్సరాలుగా బీసీలను జెండాలు మోసే బానిసలుగానే వివిధ రాజకీయ పార్టీలు చూసాయని కానీ బిసి రాజకీయంగా ఆర్థికంగా అన్ని రోజున ఈ నిర్ణయం తీసుకోవడం ద్వారా దేశ ప్రజలందరూ నరేంద్ర మోడీకి రుణపడి ఉన్నారని ఆయన అన్నారు. భారతీయ జనతా పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడే పార్టీ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు గొంగల్లా మహేష్, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు గుండ్ల ఆంజనేయులు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమ్మిడి శోభా రెడ్డి, ఘట్కేసర్ మండల అధ్యక్షులు బస్వా రాజు గౌడ్, సీనియర్ నాయకులు కాలేరు రామోజీ, ఎదగని శ్రీరాములు, కంభం లక్ష్మారెడ్డి, పల్లె మధు, కిషోర్ గౌడ్, వివిధ మోర్చా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సినీ నటుడు విజయ్ దేవరకొండ పై చర్య తీసుకోవాలి

- గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు విజయ్ దేవరకొండ పై చర్య తీసుకోవాలి



**జయభేరి, దేవరకొండ :**

'రెట్రో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. 500 సంవత్సరాల క్రితం వారు బుద్ధి లేకుండా కొట్టుకున్నారు అనే వ్యాఖ్యలతో పాటు, ఉగ్రవాదులతో పోల్చేలా మాట్లాడటం అసహ్యకరమైనది, హేయమైనది. ఈ వ్యాఖ్యలు SC/ST అట్రాసిటీ చట్టం ప్రకారం శిక్షార్హమైనవి. గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.



## ఆర్ వీ ఎం ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స


- వ్యక్తికి కృత్రిమ కను గుడ్డును అమర్చిన వైద్య బృందం

**జయభేరి, మే 3:**

సిద్దిపేట జిల్లా లక్ష్మక్కపల్లి లోని ఆర్ వీ ఎం ఆస్పత్రిలో అరుదైన కంటి శస్త్ర చికిత్స జరిగింది. వైద్యులు ఎంతో కష్టపడి ఓ వ్యక్తి కి శస్త్ర చికిత్స ద్వారా కృత్రిమ కను గుడ్డును అమర్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన కట్ల సమ్మయ్య (75) వ్యక్తికి గత కొన్ని సంవత్సరాలుగా ఎడమ కను గుడ్డు పూర్తిగా చెడిపోయి ఉంది. అయితే ఆర్ వీ ఎం ఆస్పత్రిలో అరుదైన వైద్య సేవలు అందుతాయని తెలుసుకున్న సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి విచ్చేసారు. కాగా ఇక్కడి వైద్యులు అతన్ని పరీక్షించి అతని కంటికి కర్నియల్ అల్సర్ ఉందని గుర్తించారు. వెంటనే సుమారు గంటకు పైగా శస్త్ర చికిత్స చేసి ఆ అల్సర్ ను పూర్తిగా తొలగించి కృత్రిమ కను గుడ్డును అమర్చారు. అయితే ఈ శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో రోగి కుటుంబ సభ్యులు మరియు బంధువులు ఇక్కడి వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఈ శస్త్ర చికిత్స లో ఎంతో అనుభవజ్ఞు లైన కంటి వైద్య నిపుణులు డాక్టర్ నర్సయ్య, డాక్టర్ కపిల్ మరియు వారి వైద్య బృందం పాల్గొన్నారని ఆస్పత్రి సీఈఓ దేవరకొండ శ్రీనివాస్ రావు తెలిపారు.

## త్వరలోనే.. గజ్వేల్ కు మంత్రి తుమ్మల రాక

- డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



**జయభేరి, గజ్వేల్, మే 03 :**

రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొండపాక, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్లతో కలిసి మంత్రిని గజ్వేల్ నియోజకవర్గ పర్యటనకు ఆహ్వానించారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 10వ తేదీలోపు గజ్వేల్ పర్యటనకు రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మార్కెట్ కమిటీల సన్మాన కార్యక్రమంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి చెప్పారు. మొదటగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త లు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించగా, నాయకులు సాజిద్ బేగ్, రాజేశ్వర్ గుప్త, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంగూడ సంపన్ బోల్ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ఎంపికి వినతి

- సానుకూలంగా స్పందించిన ఎంపీ.. నిధుల మంజూరుకు హామీ



**జయభేరి, మే 3:**

జగ్గంగూడ, సంపన్ బోల్ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ గ్రామస్థులు ఎంపీ ఈటెల రాజేందర్ కు వినతి పత్రం అందచేశారు. జగ్గంగూడ లోని పల్లె దవాఖాన, సీసీ రోడ్డు పనులు సత్వరమే చేపట్టాలని వారు ఎంపీని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సంపన్ బోల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలని ఎంపీని కోరారు. కాగా దీనిపై ఎంపీ ఈటెల రాజేందర్ సానుకూలంగా స్పందిస్తూ అతి త్వరలోనే గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తామని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఎంపీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## చేనేత హస్తకళ మేళా

- మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్




**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట పట్టణం లోని కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా వద్ద గల ఆర్య వైశ్య కల్యాణ మండపంలో చేనేత హస్త కళా మేళాను ప్రారంభించిన మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, ఈ సందర్భంగా వారు మాట్లాడుచూ ఈ ఎక్సిబిషన్ లో మహిళలకు కావాల్సిన భాగల్పూరి చీరలు, బెంగాల్ కాటన్, చండేరీ చీరలు, మంగళగిరి చేనేత చీరలు, వన్ గ్రామ జ్యువలరీ, యువతులకు కావాల్సిన జైపూర్ టాప్స్, లెగ్గింగ్స్, డ్రెస్ మెటీరియల్ తో పాటు మగవారికి కావాల్సిన పొద్దుటూరు కాటన్ షర్ట్స్, పాయింట్స్, వరంగల్ లుంగీలు, టవల్స్, హౌస్ హోల్డ్ ఐటమ్స్ సరసమైన ధరలకు లభించేలా నిర్వాహకులు వినోద్ కుమార్, శ్రవణ్ ఏర్పాట్లు చేశారని, ఇట్టి అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు, ఇట్టి కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షఫి ఉల్లా, జిల్లా కాంగ్రెస్ నాయకులు కుమ్మరికుంట్ల లింగయ్య, అయూబ్ ఖాన్, గవ్వ కృష్ణ రెడ్డి, బచ్చు శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాక్‌పై ఆర్థిక దిగ్బంధం!

- పాక్ ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు భారత్ ప్లాన్
- పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో తిరిగి చేర్చడంపై చర్చలు
- రుణాలు ఇవ్వకుండా ఆర్థిక సంస్థలపై ఒత్తిడికి వ్యూహం



**జయభేరి, న్యూఢిల్లీ, మే 3 :**

పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై దౌత్య పరమైన ఆంక్షలు విధించడమే కాకుండా దాయాది దేశాన్ని ఆర్థికపరమైన చక్రవ్యూహంలో బంధించాలని భారత్ యోచిస్తోంది. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే దేశాలపై ఆర్థికపరమైన ఆంక్షలను విధించే లక్ష్యంతో ఏర్పడిన ఆర్థిక కార్యాచరణ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్టులో పాకిస్థాన్‌ను తిరిగి చేర్చాలని ఒత్తిడి తీసుకురావాలని భారత్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌పై రెండు రకాలుగా ఆర్థికపరమైన ప్రతీకార చర్యలు చేపట్టాలని భారత్ యోచిస్తోంది. అందులో మొదటిది పాకిస్థాన్‌ను మళ్లీ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్పించేలా లాబీ చేయడం.

దేశంలోని ఉగ్రవాద గ్రూపులకు సరిహద్దుల అవతల నుంచి అందుతున్న ఆర్థిక సహాయాన్ని అడ్డుకోవాలన్న విస్తృతమైన వ్యూహంలో భాగంగా ఈ చర్య చేపట్టాలన్నది భారత్ ఆలోచన. ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాక్‌ను చేర్చాలన్న డిమాండును ముందుకు తీసుకెళ్లాలంటే తీసుకోవలసిన చర్యల గురించి ప్రభుత్వంలో చర్చ జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. పాకిస్థాన్ గతంలో 2018 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో ఉంది. గతంలో ఈ లిస్టులో ఉన్న రోజుల్లో దేశంలోకి అక్రమ నిధుల ప్రవాహం తగ్గిందని భారత్ వాదిస్తోంది. ఇక రెండో చర్య పాకిస్థాన్‌కు రుణాలు అందచేస్తున్న బహుళ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవడం. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు, ఆసియన్ అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ)తోసహా ప్రధాన ఆర్థిక సంస్థలతో బహిరంగ చర్చలు ప్రారంభించాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.పాకిస్థాన్‌కు అందచేస్తున్న ఆర్థిక సహాయాన్ని పునఃసమీక్షించాలని ఆయా ఆర్థిక సంస్థలను కోరాలని భారత్ భావిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమైనప్పటికీ పాకిస్థాన్‌కు అభివృద్ధి సాయం కొనసాగడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేయనున్నట్లు తెలుస్తుంది.

**రుణం అందకుండా ఒత్తిడి**

ఆర్థికంగా దివాలా తీసిన పాకిస్థాన్‌కు తిరిగి పట్టాలెక్కించడానికి ఐఎంఎఫ్ 700 కోట్ల డాలర్ల(భారతీయ కరెన్సీలో రూ.59,026 కోట్లు) రుణాన్ని అందచేస్తోంది. 2024 సెప్టెంబర్‌లో విడుదలైన ఈ రుణం విడతల వారీగా పాక్ అభివృద్ధి కోసం విడుదల చేస్తోంది. పాకిస్థాన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి 1958 నుంచి ఇప్పటివరకు 24 సార్లు ఐఎంఎఫ్ రుణం అందచేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరాయంగా పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఈ తరహా ఆర్థిక సహాయం అందచేయడంలోని విశ్వసనీయతను, దూరదృష్టిని భారత్ ప్రశ్నించే అవకాశం ఉంది. ఇది గాక 4,340 కోట్ల డాలర్ల(రూ.1.13 లక్షల కోట్లు) రుణాన్ని 764 పబ్లిక్‌సెక్టార్ రుణాలు, గ్రాంట్ల కింద పాకిస్థాన్‌కు అందచేయడానికి ఆసియన్ అభివృద్ధి బ్యాంకు ముందుకువచ్చింది. వీటితోపాటు 365 ప్రాజెక్టుల కోసం 4,970 కోట్ల డాలర్ల రుణాన్ని (రూ.4.19 లక్షల కోట్లు) అందచేస్తామని ప్రపంచ బ్యాంకు పాకిస్థాన్‌కు వాగ్దానం చేసింది. ఈ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి పాకిస్థాన్‌కు రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవాలని భారత్ యోచిస్తున్నట్లు ఆ అధికారి తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

- ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- పేదల సంక్షేమ సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

**జయభేరి, వర్గల్, మే 03 :**



గజ్వేల్ నియోజకవర్గంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న 800 లకు పైగా కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బాగనోల్ల విజయ, వైస్ చైర్మన్ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం వర్గల్ లో తహసిల్దార్ బాల రాజుతో కలిసి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. పేదల సంక్షేమం సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం కాగా, రాష్ట్రంలో ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈ రోజుల్లో పేదింటి ఆడపిల్ల పెళ్లి చేయడం ఎంత కష్టమో ప్రతి ఒక్కరికి తెలిసిందేనని, అయితే దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆడపడుచు కానుకగా కళ్యాణ లక్ష్మి నిధులు మంజూరి చేసినట్లు చెప్పారు.

అలాగే త్వరలోనే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరీ చేస్తుండగా, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నాల నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న విగ్రహం కోదాడ లో విగ్రహ ప్రతిష్ట

**జయభేరి, దేవరకొండ :**




తెల్లా దొరలను ఎదిరించి పోరాడిన అధిపతి దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గొప్ప మహావీరుడు వద్దెర ఓబన్న విగ్రహం నేడు కోదాడ పట్టణంలో ప్రజావేదిక పిల్లర్ ఆడిటోరియం వద్ద ప్రతిష్ఠ ఏర్పాటు జరుగుచున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, మేనేపల్లి చంద్రావు, వడ్డెర ఎంబిసి చైర్మన్ రాములు నల్లగొండ సూర్యపేట జిల్లాల అధ్యక్షులు బద్ధ వెంకటయ్య, శివరామహేష్ , వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వేముల వెంకటేశం, నల్లగొండ జిల్లా సూర్యాపేట జిల్లా జిల్లా కమిటీ సభ్యులు గ్రామ అధ్యక్షులు మండల అధ్యక్షులు నియోజకవర్గ అధ్యక్షులు వడ్డెర కుల పెద్దలు యువకులు మహిళలు అందరూ ఈ యొక్క సమావేశానికి తప్పక హాజరు కాగలరని వడ్డెర సంఘం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ ఒక ప్రకటనలో తెలియ చేసినారు. దేవరకొండ నియోజకవర్గం నుండి డిండి మండలం చందంపేట మండలం దేవరకొండ మండలం కొండమల్లేపల్లి మండలం చింతపల్లి మండలాల నుండి గ్రామ పట్టణ నియోజకవర్గ కాంగ్రెస్ సభ్యులు కుల పెద్దలు అందరూ తప్పక హాజరు కాగలరని కోరినారు.

# కుట్టుమిషన్లను మా ఆడబిడ్డల కోసం

- మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్

**జయభేరి, పెద్దపల్లి :**

మహిళల ఉపాధి కోసం తన సొంత గృహాన్ని వాడకంలోకి తీసుకొచ్చి, ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్.

పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ జూలపల్లి మండల కేంద్రంలో "గ్రామ స్వరాజ్య సంస్థ" స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంతో పాటు ఉచితంగా తన సొంత గృహం అయిన "మహవీర్ సింగ్ నిలయం"ను అందుబాటులోకి తీసుకొచ్చి, రఘువీర్ సింగ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది.

ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ స్వయంగా తానే కుట్టు మిషన్ శిక్షణలో కొన్ని మెలకువలను అవగాహన చేసుకొని, ఆడబిడ్డలకు తగు సూచనలు చేసిన అనంతరం వారు మాట్లాడుతూ.... జూలపల్లి మండల కేంద్రంలో సరైన ఉపాధి లేక కొన్ని కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో పేదింటి ఆడబిడ్డల కోసం, వారి ఉపాధి కోసం, గ్రామ స్వరాజ్య సంస్థ ద్వారా 50% సబ్సిడీతో కుట్టుమిషన్లు అందించడమే కాకుండా, మహిళల కోసం ఉచితంగా వారి నాన్నగారైన "మహవీర్ సింగ్ నివాస్" గృహంలో దాదాపుగా 40 నూతన కుట్టుమిషన్లను మా ఆడబిడ్డల కోసం గ్రామ స్వరాజ్య సంస్థ ద్వారా అందించి, ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు పోవడం జరుగుతుందని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహించిన "గ్రామ స్వరాజ్య సంస్థ" నిర్వాహకులను రఘువీర్ సింగ్ అభినందించారు. తదనంతరం వారి కోరిక మేరకు ఉచితంగా శ్రీ మహవీర్ సింగ్ నివాస్ నిలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి వారికి అండగా నిలిచిన రఘువీర్ సింగ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, వారిని మర్యాదపూర్వకంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ధనలక్ష్మి, టైలర్ మిట్టపల్లి స్వప్న, నాయకులు పొలగాని సతీష్, బండి రాజిరెడ్డి, మేర శ్రీను, గంగిపెల్లి శ్రీను, మిట్టపల్లి భాస్కర్, కోడూరి శ్రీనివాస్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



## ప్రపంచ పత్రిక దినోత్సవం సందర్భంగా సన్మానాలు

- ప్రపంచ పత్రిక దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత సలికినేని టైగర్ జీవా ఆధ్వర్యంలో

**జయభేరి, దేవరకొండ :**

ఆంధ్రజ్యోతి పత్రిక విలేఖర్ గిరిధర్, ఈనాడు పత్రిక విలేఖర్ శ్రీనివాస్, సూర్య పేపర్ పత్రిక విలేకర్ చంద్రమౌళి, రుద్రవీణ పత్రిక విలేకర్ గోవర్ధన్ కు ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ వారికి శాల్వాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా టైగర్ జీవా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు మాట్లాడుతూ... పత్రిక స్వేచ్ఛ లోపించిన ప్రజాస్వామ్యం అసంపూర్ణం కలం గలానికి స్వేచ్ఛ ఉన్నప్పుడే అది నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందు ఉంచగలదు నిర్భయంగా నిస్వార్థంగా నిజాన్ని తెలియజేస్తూ గలాన్ని తమ కలంతో వినిపిస్తున్న పాత్రికేయులు ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అని వారు కొనియాడుతూ పాత్రికేయ మిత్రులందరికీ ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

## ఎటిఎంలో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి డబ్బులు

- మానవతా దృక్పథంతో డబ్బులు అందించిన వ్యక్తికి అభినందన



**జయభేరి, మే 3:**

ఏటీఎం కేంద్రం వ్యక్తి పోగొట్టుకున్న డబ్బులు పోలీస్ స్టేషన్ లో అప్పగించి చివరకు బాధితునికి అందించి మానవతను చాటుకున్నాడు ఓ వ్యక్తి.. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శామీర్ పేట కు చెందిన వల్లపు బుచ్చి బాబు అనే వ్యక్తి స్థానికంగా ఉన్న ఎస్ బీ ఐ ఏటీఎం సెంటర్ కు వెళ్లి డబ్బులు డ్రా చేసే క్రమంలో ముందుగానే ఎవరివో డ్రా అయిన డబ్బులు తీసుకుని పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. దీంతో పోలీసులు బ్యాంక్ కు వెళ్లి విచారించగా గ్రామానికి చెందిన మహ్మద్ నజీర్ అనే వ్యక్తికి సంబంధించిన డబ్బులు అని తెలుసుకున్న ఎస్ ఐ హారిక సదరు వ్యక్తికి అందచేశారు. కాగా ఎటిఎం లో డబ్బులు చూసి సహృదయంతో పోలీసులకు అప్పగించి బాధితునికి డబ్బులు అంద జేసిన బుచ్చిబాబు ను ఎస్ఐ హారిక అభినందించారు.

# అడ్డగోలు నిర్మాణాలు



✍ జయభేరి, హైదరాబాద్, మే 3 :

భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని కేటాయించి ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు ఇదే అదనుగా భావించి సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలను, భవనాలను ఏర్పాటు చేసుకొని దర్జాగా లబ్ధిపొందుతున్నారు.. దీనిని నివారించాల్సిన గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు మామూళ్ళ మత్తులో ఊగిపోతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు...పైగా రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటూ అధికారులను బెదిరిస్తూ దర్జాగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలు, భవనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇదేమిటని అడిగే నాథుడు లేకపోవడంతో వారు అడిందే ఆట పాడిందే పాటలా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్ గ్రామ శివారులోని గేట్ వద్ద సర్వే నంబర్ 54లో గల ప్రభుత్వ భూమిని గతంలో వీరేశం యాదవ్ అనే వ్యక్తికి సాగు చేసుకోవడానికి కొంత భూమిని కేటాయించారు. కాగా గత నాలుగైదు సంవత్సరాల క్రితం సదరు లబ్ధిదారుడు ఆ భూమిని సాగు చేయకుండా ఆ స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా భవనం నిర్మించుకున్నారు.అంతేగాకుండా రేకులతో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసి కిరాయికి ఇవ్వడం జరిగింది. ఈ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు కూడా తీసుకోకుండా తనను అడిగేవారు లేరంటూ దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇందుకు తగ్గట్టు సంబంధిత అధికా రులు సైతం అతనికే వత్తాసు పలకడంతో అడ్డూఅదుపు లేకుండా పోయింది. ప్రభుత్వం కేటాయించిన భూమిలో కేవ లం సాగు మాత్రమే చేసుకోవాలనేది నిబంధన. ఒకవేళ లబ్ధిదారుడు సాగు చేసుకోని పక్షంలో ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీ నం చేసుకోవాలి. కానీ ఇక్కడ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో సద రు లబ్ధిదారుడు దర్జాగా భవనాన్ని నిర్మించడమే కాకుండా వాణిజ్య దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని కావల్సినంత రాబడి పొందుతున్నాడు. ప్రభుత్వ భూమి లో యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. ఎందుకని ఆరా తీస్తే కిందిస్థాయి నుండి ఎమ్మెల్యే వరకు అండదండలు ఉన్నాయని అధికారులే చెప్ప డం విశేషం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన అతనిపై చర్యలు తీసుకోక పోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదుపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు ఎందుకు చర్యలు తీసు కోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మామూళ్ళకు తలొగ్గి అక్రమ నిర్మా ణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు నేరం..**

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసినట్లు మా దృష్టికి రాలేదు. తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. అయినా ప్ర భుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం నేరం. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, వ్యాపారం చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటాంనోటీసులు జారీ చేస్తాం సర్వే నంబర్ 54లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన విషయంలో విచారణ చేపడుతున్నాం. వీరేశం యాదవ్కు నోటీసులు జారీ చేస్తాం. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు



## రెండు నెలల ఆహారం నిల్వచేసుకోండి.. పీఓకేలో ప్రజలకు అలర్ట్..!

✍ జయభేరి, హైదరాబాద్ :

పహల్గాం ఉగ్రదాడితో భారత్‌పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణ నెలకొంది కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపు మాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వ చేసుకోవాలంటూ స్థానికులను పీఓకే యంత్రాంగం అప్రమత్తం చేసింది. రెండు నెలలకు సరిపడా ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలకు సూచనలు చేశాం, అని చౌధ్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో వెల్లడించారు. అలాగే స్థానిక ప్రభుత్వం రూ.100 కోట్లతో ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. ఆహారం, ఔషధాలు, ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకు ఈ మొత్తాన్ని కేటాయించినట్లు ఉల్‌హక్ తెలిపారు. పహల్గాం ఘటన పాక్ పై భారత్ ఫైనాన్షియల్ స్ట్రైక్స్, స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే దొంగ దెబ్బతో పీఓకేను తన నియంత్రణలోకి తీసుకున్న పాకిస్థాన్ ఆ ప్రాంత అభివృద్ధిని గాలి కొదిలేసింది. ఇండియాపై విద్రోహచర్యలకు పాల్పడేందుకు ఉపయోగపడే ప్రదేశంగానే పీఓకేను పాక్ చూస్తోంది. పీఓకే ప్రధానమంత్రి పీఠం అధిరోహించినవారు ఇస్లామాబాద్ సర్కారు చేతుల్లో కీలు బొమ్మగానే మిగిలిపోతున్నారు. ఫలితంగా స్థానికుల హక్కులకు రక్షణ కరవవుతోంది. దివాళ అంచున ఉన్న పాకిస్థాన్‌ను స్థానిక తిరుగుబాట్లు, వరుస ఉగ్రదాడులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ భారత్ అనుకూలవాదం వినిపిస్తోంది. కాగా, భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ.. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తంచేశారు.



## దోస్త్.. నోటిఫికేషన్ రెడీ

✍ జయభేరి, హైదరాబాద్, మే 3:

తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో 2025, 26 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్ మే 2న వెలువడింది. జూన్ 23 వరకు మొత్తం మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగనుంది. విద్యార్థులు మొదటి విడతలో రూ.200 చెల్లించాలి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇక రెండు, మూడో విడతల్లో రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. 21 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్లు నిర్వహించి, మే 10 నుంచి 22 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇవ్వనున్నారు. విద్యార్థులకు మే 29న సీట్లను కేటాయించనున్నారు. అదేవిధంగా మే 30 నుంచి జూన్ 8 వరకు రెండో విడత రిజిస్ట్రేషన్లు నిర్వహించి, మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించనున్నారు. రెండో విడత సీట్లను జూన్ 13న కేటాయించనున్నారు. ఇక చివరి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియను జూన్ 13 నుంచి 19 వరకు నిర్వహించి.. జూన్ 13 నుంచి 19 మధ్య వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చు. వీరికి జూన్ 23న సీట్లను కేటాయించనున్నారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తర్వాత జూన్ 30 నుంచి డిగ్రీ కాలేజీల్లో తరగతులు ప్రారంభంకానున్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గత విద్యాసంవత్సరానికి సంబంధించి 'దోస్త్' ప్రవేశాల పరిధిలో రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలో 1054 డిగ్రీ కాలేజీలుండగా, వాటిలో 136 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, నాన్ దోస్త్ కాలేజీలు 63 ఉన్నాయి. మిగిలినవి ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,86,544 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ తదితర కోర్సుల్లోని సీట్లను దోస్త్ ద్వారా భర్తీచేస్తారు.

**దోస్త్ 2025 షెడ్యూలు..**

మొత్తం మూడు విడతల్లో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ చేపట్టనున్నారు. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం హానర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీబీఎం, బీసీఏతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

**మొదటి దశ ప్రవేశాలు ఇలా..**

- మే 3 నుంచి 21 వరకు దోస్త్ మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు.
- రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు.
- విద్యార్థులకు మే 29న మొదటి విడత డిగ్రీ సీట్లను కేటాయించనున్నారు.

**రెండో దశ ప్రవేశాలు ఇలా..**

- రెండో విడత దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనుంది.
- రెండో విడత వెబ్ ఆప్షన్లకు మే 30 నుంచి జూన్ 9 వరకు అవకాశం కల్పించనున్నారు.
- విద్యార్థులకు జూన్ 13న రెండో విడత డిగ్రీ సీట్లను కేటాయిస్తారు.

**మూడో విడత ప్రవేశాలు ఇలా..**

- దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూన్ 13న ప్రారంభం కానుంది.
- విద్యార్థులు జూన్ 19 వరకు దరఖాస్తులు సమర్పించాలి.
- చివరి విడత వెబ్ ఆప్షన్లకు జూన్ 13 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు.
- విద్యార్థులకు జూన్ 23న మూడో విడత డిగ్రీ సీట్లను కేటాయిస్తారు. జూన్ 30 నుంచి కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి.

# సర్కారు నిర్లక్ష్యంతోనే రైతులకు తీరని నష్టం

- విపత్తుపై పాలకులకు ముందుచూపు లేదు
- మాయిశ్చర్ పేరుతో కాంటాలు ఆలస్యం చేసిండ్లు
- ఎకరాలకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలే
- ఈ ప్రాంత రైతులపై మంత్రికి చిత్తశుద్ధి లేదు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

✍ జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :



ప్రజాపాలన పేరుతో పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం మూలంగానే రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, అకాల వర్షానికి పంట నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షంతో తడిసిన ధాన్యంను ఆయన పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కష్టాలను ఎదుర్కొంటూ పుట్టెడు పెట్టుబడులతో సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో చేజారి పోతే ఎంత బాధ ఉంటుందో పాలకులు అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఏటా ఈ సీజన్‌లో అకాల వర్షాలు వస్తాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదిహేను ఇరువై రోజుల క్రితం కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే మాయిశ్చర్ రాలేదంటూ కాంటాలు పెట్టకపోవడం మూలంగానే ఇంత పెద్ద మొత్తంలో నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు.

ఇంత పెద్ద ఎత్తున రైతులకు నష్టం జరిగితే అడిషనల్ కలెక్టర్ వచ్చి చూసివెళ్లాడే కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కనీసం స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాపుదనపోళ్ల మీటింగ్‌లకు పోయి కాపుదనం కుటుంబంలో పుట్టకపోయినా మీ గురించి ఆలోచన చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఈనాడు రైతులకు కన్నీటి పర్యంతమవుతుంటే పట్టించుకోడా అని ప్రశ్నించారు. ఆనాడు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారని, కానీ ఇప్పుడు ధాన్యం తడిసిందని రైస్ మిల్లుల వద్ద దించుకోవడం లేదని, బస్తాలు దించుకోకపోతే రైతులతో కలిస రైస్ మిల్లును ముట్టడిస్తామన్నారు. నియోజకవర్గంలోని గరీబోళ్లే ఓట్లు వేస్తే 40ఏండ్లుగా అధికారంలో ఉంటూ కనీసం ప్రజల గురించి ఆలోచన చేయడం లేదని, ఓట్లు వస్తే నోట్ల సంచులతో వచ్చి గెలువచ్చనే ఆలోచన మానుకోవాలన్నారు.

హైదరాబాద్‌లో నాలుగు ఆఫీస్‌లు ప్రారంబించి దోపిడి చేస్తున్నారని, దోపిడి చేసిన దాంట్లో కొంతైనా పేద ప్రజలకు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా శ్రీపాద ట్రస్ట్ పేరున పంట నష్టపోయిన రైతులకు పదివేల చొప్పున అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తండ్రి ఆశయాలంటూ పదపదే మాట్లాడే ఎమ్మెల్యే తన తండ్రి ఆశయాలేంటో చెప్పాలని, ఆ ఆశయాలు పేద ప్రజల గురించే అయితే అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున ఇప్పించి ఆదుకోవాలన్నారు. మండలంలో ఇంత పెద్ద విపత్తుకు ప్రభుత్వంతోపాటు అధికారులు, పాలకులే కారణమని, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ఒక రైతు బిడ్డగా ఎందుకు ఆలోచన చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా కనీసం రైతులకు సౌకర్యాలు కల్పించకపోవడం ఏంటని ప్రశ్నించారు. కేంద్రాల నిర్వహణ ద్వారా వచ్చే కమీషన్‌లు మీ కోసం కాదని, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు వినియోగించాలని ఆయన హితవు పలికారు.ప్రజా ప్రభుత్వమని, వందేళ్ల చరిత్ర ఉందని గొప్పలు చెప్పుకోవడం కాదని, ఇలాంటి విపత్తు జరిగితే రైతులకు అండగా నిలిచి భరోసా ఇవ్వాలని ఆయన అన్నారు. నిత్యం ముఖ్యమంత్రి పక్కనే కూర్చుంటూ అనేక సలహాలు ఇచ్చే మంత్రి ఇక్కడి ప్రజల గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమని, ప్రజలకు ఉపయోగపడని పదవులు ఎందుకని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు కష్టాల్లో ఉంటే వారికి అండగా నిలుస్తామని, ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు సరైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉగ్రదాడితో పాకిస్తాన్ భారీ మూల్యం




✍ జయభేరి, ఇస్లామాబాద్, మే 3 :

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ.. పర్యాటకులపై పిరికిపందా చర్యలతో పాకిస్తాన్‌పై దాడి చేస్తోంది భారత్. భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందం, దిగుమతిఎగుమతులపై ఆంక్షలు, పాకిస్తాన్‌తో ప్రజా సంబంధాలపై నిషేధం విధించింది. దీంతో పాకిస్తాన్ కోపంగా ఉంది. పదే పదే బెదిరింపులు జారీ చేస్తోంది. తాజాగా, పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై దాడి గురించి మాట్లాడారు.సింధు నదిపై ఏదైనా ఆనకట్ట నిర్మించి, నీటిని ఆపడానికి ప్రయత్నిస్తే, పాకిస్తాన్‌పై ప్రత్యక్ష దాడిగా పరిగణిస్తామని ఖవాజా ఆసిఫ్ అన్నారు. సింధు నదిపై డ్యామ్ నిర్మాణం రెండు దేశాల మధ్య జల ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. భారతదేశం ఇలాంటిదేదైనా చేస్తే పాకిస్తాన్ మౌనంగా కూర్చోదు. దానిపై దాడి చేస్తుందని ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు. జియో న్యూస్‌తో మాట్లాడుతూ, పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయడం దానిని ఉల్లంఘించడమేనని అన్నారు. నీటిని ఆపడానికి లేదా మళ్లించడానికి భారతదేశం ఏదైనా నిర్మాణం చేస్తే, మేము ఆ నిర్మాణాన్ని దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేస్తామని బెదిరించారు. యుద్ధం అనేది ఫిరంగులు, తుపాకులతో మాత్రమే జరగదని, నీటిని ఆపడం కూడా ఒక రకమైన యుద్ధమే అన్నారు. నీరు లేకుండా ప్రజలు ఆకలి, దాహంతో చనిపోవచ్చని ఖవాజా ఆసిఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నాశనమైపోయిన పాకిస్తాన్‌కు ఈసారి భారతదేశంలో జరిగిన ఉగ్రవాద దాడి చాలా మూల్యం చెల్లించింది. భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఇది పాకిస్తాన్ కు పెద్ద దెబ్బే. ఇప్పుడు దీని గురించి ప్రపంచాన్ని వేడుకుంటోంది పాకిస్థాన్. అంతకుముందు, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో జరిగిన సంభాషణలో, పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్, సింధు జల ఒప్పందాన్ని 250 మిలియన్ల పాకిస్తానీయుల జీవనాడి అని, భారతదేశంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని విచారం వ్యక్తం చేశారు. అంతకుముందు, సింధు జల ఒప్పందంపై నిషేధం తర్వాత పాకిస్తాన్ ఎంపీ బిలావల్ భుట్టో భారతదేశానికి వ్యతిరేకంగా వివాదాస్పద ప్రకటన చేశారు. సింధు నది పాకిస్తాన్ కు చెందుతుందని భుట్టో అన్నారు. పాకిస్తాన్‌కు నీళ్లు ఆపితే, వారి రక్తం ప్రవహిస్తుందన్నారు. ఇప్పుడు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఈ విషయంపై భారతదేశంపై దాడి చేస్తానని బెదిరిస్తున్నారు. వాస్తవం ఏమిటంటే భారతదేశం ఒకదాని తర్వాత ఒకటి చేస్తున్న చర్యలు పాకిస్తాన్‌లో భయాందోళనలను సృష్టించాయి.

# నటుడు విజయ్ దేవరకొండ పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

- తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్



సినీ నటుడు విజయ్ దేవరకొండ కొన్ని రోజుల క్రితం సినీ నటుడు సూర్య నటిస్తున్న రెట్రో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో గిరిజనుల గురించి అవమానకరంగా మాట్లాడడం జరిగింది.దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని త్యాగాల చరిత్ర ఉన్న గిరిజన జాతి గురించి ఇలాంటి అవగాహన లేకుండా మాట్లాడిన విజయ్ దేవరకొండపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ డిమాండ్ చేశారు. అదేవిధంగా గిరిజన జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆయన ఇళ్ళు, ఆఫీస్ ముట్టడిస్తామని తెలిపారు.

## జీహెచ్ ఎంసి సిబ్బంది ధర్నా

✍ జయభేరి, హైదరాబాద్:

సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరేష్ పై బిజెపి కార్పొరేటర్ రాకేష్ జష్వాల్ జరిపిన దాడి వివాదస్పదమయింది. సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరేష్ పై దాడికి నిరసనగా ఆబిడ్స్ లోని జిహెచ్ఎంసి కార్యాలయం ముందు జిహెచ్ఎంసి అధికారులు ధర్నాకు దిగారు. విధులు బహిష్కరించి జిహెచ్ఎంసి కార్యాలయం నిరసన చేపట్టారు. వెంటనే రాకేష్ జష్వాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. బిజెపి జాంబగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు..

06

ప్రభాత
జయభేరి
సినిమా
04-05-2025
ఆదివారం

jayabheridaily.com




# చిక్కుల్లో బాలీవుడ్ సింగర్ సోను నిగమ్..

## కేసు నమోదు చేసిన బెంగళూరు పోలీసులు..

ప్రముఖ బాలీవుడ్ సింగర్ సోను నిగమ్ చిక్కుల్లో పడ్డారు. ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో కేసు నమోదైంది. బెంగళూరులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో ఏప్రిల్ 25, 26 తేదీల్లో జరిగిన సంగీత కార్యక్రమానికి హాజరయ్యారు. ఓ ప్రేక్షకుడు పదేపదే కన్నడ పాట పాడాలంటూ అరిచాడు. దాంతో అసహనానికి గురైన సోను నిగమ్.. ఆ యువకుడి ప్రవర్తనను కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడితో పోలుస్తూ హిందీలోనూ వ్యాఖ్యలు చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. కన్నడ.. కన్నడ అంటూ యువకుడు అరిచిన తీరును తనకు నచ్చలేదని.. ఇలాంటి ప్రవర్తన కారణంగానే పహల్గాం లాంటి దాడులు జరుగుతాయని సోను నిగమ్ అన్నట్లుగా విమర్శలున్నాయి. అయితే, సోను నిగమ్ వ్యాఖ్యలు కన్నడిగుల మనోభావాలు తీవ్రంగా బాధించాయని.. భాషాభిమానం, సాంస్కృతిక గర్వాన్ని హింసతో పోల్చడం ఏమాత్రం సరికాదంటూ మండిపడ్డారు.

ఈ క్రమంలో కర్నాటక రక్షణ వేదిక బెంగళూరులోని అవలహళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోను నిగమ్ వ్యాఖ్యలు వివిధ భాషా సమూహాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని, హింసను ప్రేరేపించే అవకాశం ఉందని సదరు సంస్థ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, పరువు నష్టం, మత భాషా పరమైన మనోభావాలను దెబ్బతీయడం తదితర సెక్షన్ల కింద శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే, ఈ వ్యవహారంపై సోను నిగమ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను కన్నడ పాట పాడమని అడిగినందుకు కాదని, కొందరు వ్యక్తులు బెదిరింపు ధోరణితో ప్రవర్తించినట్లుగా ఆరోపించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, పహల్గాం దాడిని ఉదాహరణగా చెప్పి, ప్రేమ ఉన్నచోట విద్వేషానికి తావులేదని చెప్పడమే తన ఉద్దేశమని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

# ప్యారడైజ్ షూటింగ్ మొదలైంది



'హిట్ 3'తో భారీ విజయాన్ని అందుకున్నారు నాని. దసరా, సరిపోదా శనివారం సినిమాలతో వరుసగా రెండుసార్లు వందకోట్ల క్లబ్‌లోకి చేరిన నాని, ముచ్చటగా మూడోసారి 'హిట్ 3'తో ఆ మార్క్‌ని చేరుకోనున్నారు. ఈ వేడిలోనే తన తదుపరి సినిమా 'ది ప్యారడైజ్' షూటింగ్‌ని కూడా మొదలుపెట్టేశారు నాని. 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో మొదలైంది. ఇది భారీ బడ్జెట్ సినిమా కావడంతో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ కూడా ఈ సినిమా నిర్మాణంలో భాగమైనట్టు విశ్వసనీయ సమాచారం. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేస్తామని, వచ్చే ఏడాది మార్చి 26న విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. రమ్యకృష్ణ, సోనాలి కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీత దర్శకుడు.




# కెరీర్ పీక్‌లో ఉండగానే..

తన అందంతో కుర్రాళ్లను మాయలో పడేసింది ఈ చిన్నది. అలాగే నటనలోనూ మంచి మార్కులు కొట్టేసింది ఈ బ్యూటీ. ఈ చిన్నది చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. కెరీర్ లో ఒకే ఒక్క భారీ హిట్ అందుకుంది ఆ బ్యూటీ. కెరీర్ పీక్ లో ఉండగానే యాక్సిడెంట్ కు గురయ్యింది. అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడింది. దాదాపు రెండేళ్లు బెడ్ కే పరిమితం అయ్యింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారింది ఫొటోలో ఉన్న భామ. కెరీర్ స్టార్టింగ్ లోనే భారీ హిట్ అందుకుంది. ఆతర్వాత కొన్ని ఫ్లాప్స్ అందుకుంది. కెరీర్ పీక్ లో ఉండగానే యాక్సిడెంట్ కు గురయ్యింది. ఆమె ఎవరంటే అందాల నభా నటేష్. నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. సుధీర్ బాబు హీరోగా నటించిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా భారీ హిట్ అందుకోవడంతో పాటు కలెక్షన్స్ కూడా భారీగా రాబట్టింది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు అందుకుంది. అయితే ఈ అమ్మడికి అవకాశాలు క్యూ కడుతున్న సమయంలో ఊహించని విధంగా రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. ఈ ప్రమాదంలో నభా తీవ్రంగా గాయపడింది. దాంతో ఆమె రెండేళ్లు బెడ్ పైనే ఉండాల్సి వచ్చింది. ఇక కోలుకున్న తర్వాత తిరిగి సినిమాలతో బిజీగా మారింది. మొన్నామధ్య డార్లింగ్ అనే సినిమా చేసింది కానీ ఆ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. ఇప్పుడు స్వయంభు సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ చిన్నది సోషల్ మీడియాలో చురుకుగా ఉండే నభా .. హాట్ హాట్ ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది.

# ఎక్కడో చూసినట్టుందే..!

సమంత రూత్ ప్రభు నిర్మాతగా తొలి అడుగు వేసిన చిత్రం 'శుభం'. ఈ సినిమాని సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఒక హారర్ కామెడీ థ్రిల్లర్ జోనర్ లో రూపొందింది. మే 9, 2025న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్ విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. 'శుభం' సినిమా ట్రైలర్ గురించి చెప్పాలంటే.. ఒక ఊరిలోని మహిళలు టీవీ సీరియల్స్‌కు అతిగా అలవాటు పడి, ఆ తర్వాత దెయ్యాల్లా ప్రవర్తించడం చుట్టూ కథ నడుస్తుందని అర్థమవుతోంది. ఈ కథాంశం వినోదాత్మకంగా, అదే సమయంలో ఉత్కంఠభరితంగా ఉంటుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. సమంత ఈ చిత్రంలో మాతాజీ పాత్రలో కనిపించనుంది. ఆమె లుక్ ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదిలా ఉంటే శుభం సినిమాలో నటించిన ఈ నటిని గుర్తుపట్టారా.? ఆమె పేరు శ్రియ కొంతం. ఈ చిన్నది గతంలో నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన గ్యాంగ్ లీడర్ సినిమాలో నటించి మెప్పించింది. గ్యాంగ్ లీడర్ సినిమాతో ఫేమస్ అయిన ఈ అమ్మడు మరో సినిమాలో కనిపించలేదు. కొన్నాళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఈ అమ్మడు.. సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం క్రేజీ గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తూ నెట్టింట అరాచకం సృష్టించింది ఇక ఇప్పుడు వరుస సినిమాలతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం శుభం సినిమాలో ప్రధాన పాత్రలో నటిస్తుంది. ట్రైలర్ లో ఆమె నటన ఆకట్టుకుంది. ఈ సినిమాతో శ్రియ కొంతం మంచి గుర్తింపు తెచ్చుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. ఈ సినిమాతో పాటు మరికొన్ని సినిమాల్లోనూ ఈ చిన్నది అవకాశాలు అందుకుందని తెలుస్తుంది. శుభం సినిమాలో దెయ్యం పట్టిన యువతిగా తన నటనతో ఆకట్టుకుంది శ్రియ.






# సూర్య రెట్రో సినిమా పరిస్థితి ఏంటి..

తమిళ నటుడు సూర్య వైవిధ్యమైన సినిమాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తుంటాడు. తాను చేసే ప్రయోగంలో ఫ్లాప్‌లు వచ్చిన వెనకంజ వేయడు. గత చిత్రం కంగువా డిజాస్టర్ కాగా, ఇప్పుడు తన 44వ చిత్రం రెట్రో అనే సినిమా చేశాడు.

రొమాంటిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా గా రూపొందిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించింది. స్టోన్ బెంచ్ క్రియేషన్స్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై కార్తికేయన్ సంతానం, సూర్య, జ్యోతిక నిర్మాతలుగా మారి నిర్మించారు. పాపులర్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ దర్వకత్వంలో రూపొందిన ఈ సినిమాలో జయరాం, జోజు జార్జ్, కరుణాకరన్, నాజర్, ప్రకాశ్ రాజ్ తదితరులు నటించారు. నాని చిత్రం హిట్ 3కి పోటీగా ఈ మూవీ విడుదలైంది.

రెట్రో సినిమాకి మిక్‌స్‌డ్ టాక్ రాగా, బాక్స్ ఆఫీస్ వద్ద పర్వాలేదు అనిపించింది. ఫస్ట్ డే కలెక్షన్లు చూస్తే.. తమిళనాడులో రూ.17.25 కోట్లు వసూలు చేసిందని సమాచారం. కంగువా సినిమా కంటే ఇది ఎక్కువే. ప్రపంచవ్యాప్తంగా మొదటి రోజు 35 కోట్లకు పైగా వసూలు చేసిన రెట్రో రెండో రోజు కాస్త తక్కువ వసూళ్లే సాధించిన రూ. 50 కోట్లకు చేరువైందని చెబుతున్నారు. అయితే ఎంత వసూలు చేసిందనే దానిపై పూర్తి వివరాలు బయటకు రాలేదు. ఈ రోజు రేపు వీకెండ్స్ కాబట్టి వసూళ్లు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. మొత్తం మీద రివ్యూస్ కాస్త డల్‌గా ఉన్నప్పటికీ సూర్య రెట్రో వసూళ్లలో కాస్త దూకుడు చూపిస్తుందనే అంటున్నారు.

సూర్య నటించిన రెట్రో సినిమాకి ఓవర్సీస్‌లో భారీగా స్పందన కనిపించలేదు. గల్ఫ్ దేశాల్లో కూడా ఈ సినిమాకు రెస్పాన్స్ అతంత మాత్రంగానే ఉంది. ఈ చిత్రం ఓవర్సీస్‌లో 9 కోట్ల రూపాయల మేర కలెక్షన్లు సాధించింది. దాంతో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 36 కోట్ల రూపాయల వసూళ్లను సాధించింది. ఇటీవల కాలంలో తమిళ సినిమాకు అత్యుత్తమ వసూళ్లు అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. అయితే అయితే ఈ సినిమా సూర్య కెరీర్‌లోనే బెస్ట్ కలెక్షన్లను రాబట్టిందని అంటున్నారు. ఈ సినిమా వసూళ్లు ట్రేడ్ వర్గాల అంచనాలను కూడా దాటేశాయి. రానున్న రోజుల్లో ఈ సినిమా నిలకడగా వసూళ్లను సాధిస్తుందా లేదా అనేది చూడాలి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com